# తన జీవితాన్ని గందరగోళం చేసికొన్నప్పుడు దావీదుకు అవసరమయ్యిందేమి

## (2 సమూ. 11; 12)

దావీదు సాధనలను గూర్చి మనం చదువుకొంటు వస్తున్నాం, అయితే యిప్పుడు మనం విషయాన్ని మార్చాలి. ఈ పాఠము దావీదు సాధించిన విజయములను గూర్చినది కాదు. ఇది అతని సాధనల ఘనతకు సంబంధించినది కాదు, అయితే అతని జీవితంలోని చీకటి దినములను గూర్చినది. దీన్ని నేను "తన జీవితాన్ని గందరగోళం చేసికున్నప్పుడు దావీదుకు అవసరమయ్యిందేమి" అని పిలుస్తున్నా.[1] ఇది అంత ఉదాత్తమైన శీర్షిక కాదు, అయితే దీనితో మనమందరం పోల్చుకోగలుగుతాం.

## దావీదు తన జీవితాన్ని బారీ ఎత్తున గందరగోళం చేసికొన్నాడు (2 సమూ. 11)

దావీదు తన జీవితాన్ని గందరగోళం చేసికున్నాడని నేను నిన్ను ఒప్పించనక్కరలేదు. ఇది మనకు బాగుగా తెలిసిన కథయే.

### పాపము

దావీదు సిరియనులతోను అమ్మోనీయులతోను యుద్ధం చేస్తున్నాడు. సిరియనులు ఓడింపబడ్డారు. అమ్మోనీయులు రబ్బా పట్టణంవరకు తరుమబడ్డారు. అమ్మోనీయుల సైన్యం రబ్బాలోని శిబిరాల్లో ఉండిపోయింది. రెండవ సమూయేలు 11 యిలా ఆరంభమౌతుంది: "వసంతకాలమున రాజులు యుద్ధమునకు బయలుదేరు సమయమున దావీదు యోవాబును అతనివారిని ఇశ్రాయేలీయులనందరిని పంపగా వారు అమ్మోనీయులను సంహరించి రబ్బా పట్టణమును ముట్టడివేసిరి." అయితే "దావీదు యెరూషలేమునందు నిలిచెను" (1 వ.)[2] అనే కర్మానుసారమైన మాటయు ఉండనే ఉన్నాయి. మన అమ్మమ్మ చెప్పినట్లు, "సోమరి చేతులు దయ్యపు కర్మాగార"మనే పెద్ద సామెత ఉంది.

సోమరిగా ఉన్న వసంత కాలపు ఒక సాయంత్రాన,[3] అతని జనులు రబ్బావద్ద యుద్ధం చేస్తూ చస్తూ ఉండగా, తన రాజనగరు[4] మిద్దెమీద దావీదు నడుస్తూ ఉన్నాడు. "స్నానము చేయు ఒక స్త్రీ కనబడెను. ఆమె బహు సౌందర్యవతియై యుండుట చూచి ..." (11:2). ఈ దృశ్యం మీద చాలా ఊహా గానాలు ఉన్నాయి మరియు ఎవరు ఎక్కువ నిందితులై యుంటారో[5]– పలు రకాలైన ఆలోచనలున్నాయి మనకు వివరాలు తెలియవు,[6]

ఊహించడంలో అర్థముండదు. ఒక విషయం మాత్రం మనకు తెలుసు: దావీదు శోధింపబడినప్పుడు, వెంటనే అతడు ఆ చోటును విడువవలసి యుండేది. "జారత్వమునకు దూరముగా పారిపోవుడి" అనేది పరిశుద్ధాత్మ యొక్క సందేశమైయుంది (1 కొరింథీ. 6:18). దానికి బదులు దావీదు తన హృదయంలో కామాన్ని ఎదుగనిచ్చాడు – ఈ విధానము ఆత్మ సంబంధమైన మరణానికి ఎల్లప్పుడు త్రోవతీస్తూ ఉంటుందని యాకోబు వివరించాడు (యాకోబు 1:14, 15).

దావీదు ఆ స్త్రీ విషయమైన వివరాలు తెలిసికొని, ఆమె హిత్తీయుడగు ఊరియా భార్యయైన బత్షెబ అని కనుగొన్నాడు. హిత్తీయుల దేశ చరిత్ర ఇశ్రాయేలుతో పెనవేసుకుంది.[7] ఊరియా జన్మను బట్టి ఇశ్రాయేలీయుడు కాకపోయినా, అతని పేరుకు "నా వెలుగు యెహోవా" అని అర్థం. అంటే, అతడుగాని, అతని తల్లిదండ్రులుగాని యూదా మతానికి మార్పు చెందియున్నట్టు గోచరిస్తుంది. 2 సమూయేలు 23లో దావీదు యొక్క "బలాఢ్యులలో" ఊరియా పేరు ఉంటుంది చూడు.[8] హిత్తీయుడైన ఊరియా దావీదు నమ్మదగిన స్నేహితులలో ఒకడు. గతకాలంలో దావీదు కొరకు అతడు తన జీవితాన్ని ఆపదలో పెట్టుకున్నాడు. అతడు యుద్ధశూరుడు. ఏదియెలాగున్నా, అది దావీదు దురాశను తీర్చలేదు. దేవుని ప్రతినిధిగా ప్రవర్తించడానికి బదులు, ఆనాటి తూర్పు దేశపు బలశాలులవలె ప్రవర్తించాడు. బత్షెబను తన వద్దకు పిలిపించుకున్నాడు, వ్యభిచరించాడు, తిరిగి ఆమెను తన యింటికి పంపివేశాడు.[9]

తాను "గర్భవతియైనట్టు" కొద్ది కాలంలోనే బత్షెబ దావీదుకు వర్తమానం పంపింది. దావీదు తన పాపానికి భాధ్యుడై దాని ప్రతిఫలాలను అనుభవించే కాలం ఆసన్నమయ్యింది. దానికి బదులు, అతడు తాను చేసినదానిని కప్పివేయడానికి కృషి చేశాడు. అతడు సైన్యంలోనికి వర్తమానం పంపి ఊరియాను యింటికి పంపుమని తన సైన్యాధిపతియైన యోవాబుకు చెప్పాడు.

తరువాత ఏడు వచనాలలో ఊరియా యొక్క యథార్థత, నమ్మకత్వం, దావీదులోని నకిలీ ప్రవర్తన, అపనమ్మకత్వం మధ్యగల తారతమ్యం చూపబడింది. ఊరియా యింకను తన యుద్ధసంబంధమైన ఘోరాకృతి, ముడుతలతో అలసటతో రాజనగరునకు చేరుకున్నాడు. యుద్ధం ఎలా జరుగుతుందో తెలిసికోవాలనే వంకతో దావీదు అతని పిలిపించాడు. దానిని ప్రక్కనే ఉంచి, "దావీదు – ఇంటికి పోయి శ్రమ తీర్చుకొనుమని ఊరియాకు సెలవియ్యగా" (11:8). అంటే, "కొంత విశ్రాంతి తీసికో, విలాసము అనుభవించు. యుద్ధ సంబంధమైన పాదరక్షలను వదలివేయ్ – యింటి భోజనం తిను నీ భార్యతో కొంత సమయం గడుపు" అని దావీదు అతనికి సెలవిచ్చాడు. ఊరియా లెక్కలు వేసికొనక పోయినట్లయితే, ఆ బిడ్డ తన బిడ్డని అతడు తలంచుతాడని దావీదు భావన. దర్బారును ఊరియా విడువగా, తాను యింటికి వెళ్లేలా ప్రోత్సహించడానికి అతని వెంట దావీదు బహుమానాన్ని సహితము పంపాడు.[10]

ఏదియెలాగున్నా, ఊరియా తన కర్తవ్యంపట్ల అంత భక్తి మర్యాదలు గలవాడని దావీదు తలంచలేదు. ఊరియా యిల్లు కొద్ది దూరంలోనే ఉంది.[11] అయినా అతడు అక్కడికి వెళ్లలేదు. దానికి బదులు పూర్ణంగా పోరాటపు దుస్తులతోనే అతడు, "తన

యేలినవాని సేవకులతో కూడ రాజనగరి ద్వారమున పండుకొనెను" (11:9)! అది దావీదుకు తెలియవచ్చినప్పుడు, అతడు ఆశ్చర్యపడ్డాడు. ఊరియాను తన దృష్టితో ఆలోచించాడు, బత్షెబనుండి దూరంగా అతడు ఎలా పండుకోగలిగాడో ఊహించలేక పోయాడు. తన యోధుని తన వద్దకు పిలువనంపి, "–నీవు ప్రయాణముచేసి వచ్చితివి గదా; యింటికి వెళ్లకపోతివేమని" అడిగాడు (11:10). దావీదు బలాఢ్యులలో దాగియున్న రాజభక్తి ఊరియా జవాబులో వెల్లడియయ్యింది:

> ఊరియా మందసమును[12] ఇశ్రాయేలు వారును యూదావారును గుడారములలో నివసించుచుండగను, నా అధిపతియగు యోవాబును నా యేలినవాడవగు నీ సేవకులును బయట దండులో నుండగను, భోజనపానములు చేయుటకును నా భార్యవద్ద పరుండుటకును నేను యింటికి పోవుదునా? నీతోడు నీ ప్రాణముతోడు నేనాలాగు చేయువాడను కానని దావీదుతో అనెను (11:11).

దేవుని మందసం పట్ల తనకున్న భక్తి, తన సైన్యాధిపతి పట్లను సైన్యం పట్లను తనకున్న అక్కర, తనతోటి సైనికులు ఎర్రని ఎండలో దండులో ఉండగా తాను సుఖం అనుభవించడానికి ఊరియా నిరాకరించినప్పుడు – దావీదు కదిలింపబడకుండ ఎలా ఉండగలిగాడో నేను ఊహించలేను. ఏదియెలాగున్నా, దావీదుకు వినిపించిందంతా – "నా భార్యయొద్ద పరుండుటకు నేను ఇంటికి పోదునా?" అనే మాటలులాగానే కన్పిస్తుంది.

దావీదుకు చెమటలు పట్టుకొస్తున్నట్టు నేను చూడగలను. "నేను ఏమి చేయగలను?" అనే అతని ఆలోచనలను నేను వినగలను. తాను మరొక ఉపాయం ఆలోచించుకొనేవరకు యెరూషలేములోనే ఉండుమని దావీదు ఊరియాకు చెప్పాడు. ఈ ఉపాయం తాగించడానికి చేసిన ఉపాయం. ఊరియా త్రాగి మత్తుడైతే తన ఆదర్శాలన్నిటిని మరచి, యింటికి వెళ్లి తన భార్యతో పండుకుంటాడని దావీదు తలంచాడు.

ఆ రాత్రి దావీదు ఊరియాను భోజనానికి ఆహ్వానించాడు. ఆ భోజనం సర్వోన్నతుడగు దేవుని సేవకునికి గాక విగ్రహారాధకునికి తగినట్టుగా ఏర్పాటు చేయబడింది. దావీదు ఊరియాను తిండి త్రాగుడుతో నింపాడు. మరోసారి దావీదు తన సేవకుని నమ్మకత్వాన్ని తప్పుగా అంచనా వేశాడు. దావీదు యొక్క స్వస్థ బుద్ధికంటె ఊరియా త్రాగిన స్థితియే మేలుగా ఉంది. ఊరియా "తన యింటికి వెళ్లలేదు" (11:13), కాని తన రాజనగరి గుమ్మము వద్ద నిద్రించాడు.

ఒకడు తన పాపాన్ని తప్పుకొన యత్నించినప్పుడు, ఆగే చోటంటూ ఉండదు. మన గత పాఠంలో దావీదు రాజై "తన జనులనందరిని నీతిన్యాయముల బట్టి యేలుచుండెను" అని చూచాం (8:15). ఇప్పుడు, తన జీవితంలో ప్రవేశించిన పాపాన్ని బట్టి, నీతి న్యాయములుగల న్యాయాధిపతి నిర్దోషిపై మరణ దండన విధిస్తున్నాడు. దావీదు ఊరియాను ఉత్తరం చేతికిచ్చి యోవాబు వద్దకు పంపుతున్నాడు "– యుద్ధము మోపుగా జరుగుచున్నచోట ఊరియాను ముందుపెట్టి అతడు కొట్టబడి హతమగునట్లు నీవు అతని యొద్దనుండి పారిపొమ్ము" అని అందులో వ్రాయబడియుంది (11:15). ఆ సమాచారం ఊరియా చేతనే దావీదు పంపడం వింతగా ఉంది (11:14); మరణ దండనను మోసికొని

వెళ్లేవాడు దానిని చూడడని దావీదుకు ఆ మనిషిమీద నమ్మకం ఉంది. దావీదు ఊరియాను ఎంతగా గౌరవించాడంటే, ఆత్మాహుతివై పనిలో అతన్ని పంపినా ఆ గొప్ప సైనికుడు వెనుకాడనంతగా గౌరవించాడు. ఇది విపరీతంగా కనిపిస్తుందా?

మరోసారి దావీదు పట్ల యోవాబుకున్న సందేహరహితమైన నమ్మకత్వం కన్పిస్తుంది. రాజు యోచనను అక్షరాలా నెరవేర్చాడు. ఊరియాను ముందు భాగంలో ఉంచి అతడు పట్టణం మీద దాడి చేశాడు. వారితో యుద్ధం చేయడానికి అమ్మోనీయులు బయటికి వచ్చారు. అయితే ఇశ్రాయేలీయులు వారిని పట్టణపు గుమ్మం వద్దకు తరిమారు. అక్కడ అమ్మోనీయుల తళతళలాడు ఖడ్గాలను, అంబుల వర్షాన్ని ఎదుర్కొన్నారు.[13] "దావీదు సేవకులలో కొందరు కూలిరి, హిత్తీయుడగు ఊరియాయును హతమాయెను" (11:17). ఊరియాతో పాటు యితరులు కూడా కూలిపోయారు. తన పాపాన్ని కప్పుకొనడానికి దావీదు చేసిన సాహస ప్రయత్నానికి ప్రతిఫలంగానే అది జరిగింది. సెప్టూజంట్ ప్రకారం యింకను పదునెనమండుగురు మృతులయ్యారు. పందొమ్మిది కుటుంబాలు – ఒక కుమారుని, సహోదరుని, భర్తను మరియు/ లేక తండ్రిని పోగొట్టుకోడం – దావీదు కామాతురతను కప్పిపుచ్చుకోడానికి తప్ప మరి ఏ ఇతర ప్రయోజనం లేదు.

యోవాబు తన రిపోర్టును తిరిగి దావీదునకు పంపినప్పుడు, అతని పలుకులలో పరిహాసపు తాకుడు కన్పిస్తుంది. కడకు "విలుకాండ్రు తమ సేవకులమీద అంబులు వేయగా రాజు సేవకులలో కొందరు హతమైరి,[14] తమరి సేవకుడైన హిత్తీయుడగు ఊరియా కూడ హతమాయెను" (11:20, 21).

వార్తను తెచ్చినవాడు యోవాబు చెప్పినట్లు చేసాడు. కొందరు రాజు సేవకులు చనిపోయారు "తమరి సేవకుడైన హిత్తీయుడగు ఊరియ కూడ హతమాయెను" అని తన సమాచారాన్ని ముగించాడు (11:24).

"కొంత–పొందు కొంత–పోగొట్టుకో" అనే దావీదు యొక్క జవాబు మన హృదయాలను భగ్నం చేస్తుంది. కపటంగా తానిచ్చిన ప్రత్యుత్తరంవలన అతడు ఎంతగా ఉపశమనం పొందియుంటాడో: "– నీవు యోవాబుతో ఈ మాట చెప్పుము – ఆ సంగతిని బట్టి నీవు చింతపడకుము; ఖడ్గము ఒకప్పుడు ఒకనిమీదను ఒకప్పుడు మరియొకని మీదను పడుటకద్దు" (11:25) (అంటూ తనకు వర్తమానం తెచ్చినవానితో చెప్పి పంపుతాడు).

ఊరియా చనిపోయినట్టు బత్షెబ విన్నప్పుడు, ఆమె తన భర్త కొరకు అంగలార్చింది.[15] అంగలార్పు కాలము (ఏడు దినాలు కావచ్చు[16]) ముగియగానే, దావీదు ఆమెను అతని వద్దకు తెప్పించుకున్నాడు, ఆమె అతనికి భార్య అయ్యింది – రాజనగరిలోని అతని భార్యలలో తానొకతె అయ్యింది. కొన్ని నెలల తరువాత బత్షెబ ఒక మగ శిశువును కన్నది. అభినందనలతో దావీదు చెవ్వులు మారుమ్రోగడంతో, తాను కప్పుకొన్నది విజయవంత మైనట్టు అతడు ఆలోచించియుండవచ్చు. తన అన్యాయాన్ని గూర్చి ఎవనికీ తెలియకుండ పోవచ్చు. ఎవనికీ తెలియదా? రాజనగరిలోని ప్రతివానికి తెలుసు. అతని సేవకులకు తెలుసు. తన పిల్లలకు తెలుసు. యోవాబుకు తెలుసు. ఇతరులకు తెలుసు.[17] అతి ముఖ్యంగా, దేవునికి తెలుసు – దావీదుకూ తెలుసు.

దేవునితో అతి సన్నిహితమైన సహవాసం కలిగియుండిన దావీదు, కొద్ది దినాల్లోనే, పది ఆజ్ఞలలో 40 శాతాన్ని అతిక్రమించాడు:[18] "నీ పొరుగువాని భార్యను ఆశింపకూడదు"; "వ్యభిచరింపకూడదు"; "అబద్ధ సాక్ష్యము పలుక కూడదు"; "నరహత్య చేయ కూడదు" (నిర్గమ. 20: 17, 14, 16, 13). "అతన్ని బయటికి తీసికొనిపోయి ఉరివేయండి" అని తీర్పు చెప్పడానికి దేవునికి భయపడే న్యాయమూర్తులకు రెండు నిమిషాలు పట్టదు! దేవుని తీర్మానాన్ని ఆలకించు: "దావీదు చేసినది యెహోవా దృష్టికి దుష్కార్యముగా ఉండెను" (11:27బి).

**బాధ అనుభవించడం**

దావీదు పాపాలు స్పష్టంగా ఉన్నాయి. ఆ పాపముల యొక్క విభాగాలు సయితం మనం అర్థం చేసికోవలసి యుంటుంది.

తనకు ముందటి రాజైన సౌలుకంటె ఎంత ఘోరంగా దావీదు పాపం చేశాడో ఆలోచించు. అమాలేకీయులను సంపూర్తిగా లయమగునట్లు తుడిచివేయుమని సౌలుకు ఆజ్ఞ ఇచ్చాడు, అయితే అతడు అలా చేయలేదు. ఆ పాపాన్ని బట్టి అతడు రాజుగా ఉండకుండ నిరాకరింపబడ్డాడు.[19] మన దృష్టిలో సౌలు పాపము విస్తారమైన దావీదు పాపంతో పోల్చ తగదని ఎక్కువమంది అంగీకరిస్తారు. దేవునితో నడచిన మనుష్యుడు యిక్కడ ఉన్నాడు. అతడు యిప్పుడు పాపంలో పొర్లాడుతూ, అక్రమము యొక్క బురదలోనికి లోతుగా కూరుకొని పోతున్నాడు. సౌలు పాప ఫలితాలను మనం ఆలోచన చేసినప్పుడు, దావీదు పాప ఫలితాల విషయంలో మనకు వణకు పుట్టుకొస్తుంది!

అతి ముఖ్యంగా, పాపము దావీదును ఎంతగా నాశనం చేసిందో ఆలోచించు. కేవలం 2వ సమూయేలులోని సమాచారం మాత్రమే నీవు చదివినట్టయితే అసలు పాయింటును నీవు పోగొట్టుకుంటావు. దేవునితో అతి సన్నిహితమైన పరిస్థితులలో జీవించుతున్నవాని హృదయానికి, ఆత్మకు పాపము ఎట్టి కీడు చేసిందో ఊహించడానికి ప్రయత్నించు. అయినా, మనం ఊహించే పనిలేదు. కీర్తన. 32 మనకు యిలా తెలియజేస్తుంది:[20]

> నేను మౌనినై యుండగా దినమంతయు నేను చేసిన
> నా ఆర్తధ్వనివలన
> నా యెముకలు క్షీణించినవి.
> దివారాత్రులు నీ చెయ్యి నామీద బరువుగా నుండెను
> నా సారము వేసవికాలమున ఎండినట్టాయెను (3, 4 వచనాలు).[21]

నీవు దావీదును ఆ దినాలలో చూచియుండినట్టయితే, ఒకవేళ కొద్దిగా తెల్లబోయినట్టు నలిగినట్టు ఉన్నా, తన సింహాసనం మీద కూర్చుండి, రాజ్య సంబంధమైన బాధ్యతలను నిర్వహించుతూ ఉన్నట్టు కన్పించియుండేవాడే. అయినా, అంతరంగంలో పాపము అతని భక్షిస్తుంది లేక చీల్చివేస్తుంది. పాపము భయంకరమైనది!

రమారమి మూడువేల సంవత్సరాల క్రిందట సంభవించిన ఈ సంగతులను అర్థం

చేసికొనడం మనకు ఎందుకు ముఖ్యమైయుంటుంది? ఎందుకంటే దావీదు పడిన ఉచ్చులోనే మనం కూడా పడే అవకాశముంది. ఎందుకంటె పాపము మన జీవితాల్లో విస్తరింపవచ్చు, మనం కసాయి దుకాణంలో కుప్పకూలేవరకు అది విస్తరింపవచ్చు. దావీదును చీల్చివేసినట్టు పాపం మనలను కూడా చీల్చివేయవచ్చు. ఎందుకంటె, అది సంభవించినప్పుడు, మనం పడియున్న ఆ గందరగోళంనుండి ఎలా తప్పించుకోవాలో కూడ మనం ఎరగాలి.

## తన జీవితాన్ని క్రమంలో పెట్టుకొనడానికి దావీదుకు అవసరమయ్యిందేది (2 సమూ. 12)

తమ జీవితాలలో ప్రజలు గందరగోళంలో పడినప్పుడు, సరిదిద్దుకొని, సరిగా నడువమని జీవితాలను క్రమపరచుకోమని చెప్పజూస్తాం. ఎక్కువ సార్లు, అది అంత సులభమైనది కాదు. దావీదు తన జీవితాన్ని గందరగోళంలో పడవేసికున్నప్పుడు, కనీసం నాలుగు విషయాలు తనకు అవసరమైయున్నట్టు లేఖనం తెలుపుతోంది.

### తనతో పూర్ణంగా యథార్థంగా ఉండే ఒకడు అతనికి కావాలి

తనకు సాటిగా ఉండే, తనను బాగుగా ఎరిగినవాడై తనను ఎలా సంధించాలో, తన హృదయాన్ని ఎలా తాకాలో ఎరిగిన ఒక స్నేహితునిచే దావీదు ఆశీర్వదింపబడ్డాడు. ఆ స్నేహితుడు ప్రవక్తయైన నాతానే.[22]

దేవుడు నాతానును దావీదు వద్దకు పంపాడు. ఒక ఉపమానపు రూపంలో నాతాను దావీదు హృదయానికి ఒక అద్దాన్ని ఎత్తి పట్టాడు:

> ఒకానొక పట్టణమందు ఇద్దరు మనుష్యులు ఉండిరి. ఒకడు ఐశ్వర్యవంతుడు ఒకడు దరిద్రుడు. ఐశ్వర్యవంతునికి విస్తారమైన గొఱ్ఱెలును గొడ్లును కలిగియుండెను. అయితే ఆ దరిద్రునికి తాను కొనుక్కొనిన యొక చిన్న ఆడు గొఱ్ఱెపిల్ల తప్ప ఏమియు లేకపోయెను. వాడు దానిని పెంచుకొనుచుండగా అది వానియొద్దను వాని బిడ్డలయొద్దను ఉండి పెరిగి వాని చేతిముద్దలు తినుచు వాని గిన్నెలోనిది త్రాగుచు వాని కౌగిట పండుకొనుచు వానికి కుమార్తెవలె ఉండెను. (విషయం కండ్లకు కట్టినట్టు చెప్పబడింది) (12:1-3).
>
> అట్లుండగా మార్గస్థుడొకడు ఐశ్వర్యవంతునియొద్దకు వచ్చెను. అతడు తనయొద్దకు వచ్చిన మార్గస్థునికి ఆయత్తము చేయుటకు తన గొఱ్ఱెలలోగాని గొడ్లలోగాని దేనిని ముట్టనొల్లక, ఆ దరిద్రుని గొఱ్ఱెపిల్లను పట్టుకొని, తన యొద్దకు వచ్చినవానికి ఆయత్తము చేసెను (12:4).

దావీదు యొక్క ఘనతకు, తన న్యాయబుద్ధి యింకను సున్నితంగానే ఉంది. అందుకు అతడు చాలా కోపించాడు.

> దావీదు ఈ మాట విని ఆ మనుష్యునిమీద బహుగా కోపించుకొని[23] – యెహోవా

> జీవముతోడు నిశ్చయముగా ఈ కార్యము చేసినవాడు మరణపాత్రుడు. వాడు కనికరములేక యీ కార్యము చేసెను గనుక ఆ గొఱ్ఱెపిల్లకు ప్రతిగా నాలుగు[24] గొఱ్ఱెపిల్లల నియ్యవలెనని నాతానుతో అనెను[25] (12:5, 6).

అప్పుడు నాతాను, "ఆ మనుష్యుడవు నీవే"యని కర్మనుసారమైన పలుకులు పలికాడు (12:7).

బైబిల్లోని సంఘటనలు ఉన్నవి ఉన్నట్టుగానే వీడియో కాసెట్ చేస్తే, ఎలా జరిగాయో తెలిసికొనడం విచిత్రంగా ఉండదా? దావీదు కన్నులలోనికి పారజూస్తూ, వ్రేలు అతని వైపు చూపుతూ, నేరస్థాపన చేసే స్వరముతో - "ఆ మనుష్యుడువు నీవే"నంటూ నిలిచియుండవచ్చు. ఏదియెలాగున్నా, నాతానును హృదయం పగిలిపోయిన స్నేహితుడు గాను, దావీదు దుఃఖపూరితుడైయుండగా, కన్నులు నీళ్లతో నింపబడినవాడై, బొంగురు పోయిన గొంతుతో, "దావీదు నేను చెప్పుతున్న ఆ మనుష్యుడవు నీవే" అని అన్నట్టు నేను ఆలోచింపగోరతాను. "నీకు ఎంతో ఉంది ఊరియాకు కొంచెమే - అయినా తనకున్న దాన్ని నీవు తీసికున్నావు - తన భార్యను తన ప్రాణాన్ని సహితం తీసికున్నావ్."

నాతాను ఎలా చేసియున్నా, అది యథార్థమైన దైవ సందేశం. అది దావీదు హృదయాన్ని వెల్లడి చేసింది:

> ... ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చునదేమనగా - ఇశ్రాయేలీయుల మీద నేను నిన్ను రాజుగా పట్టాభిషేకము చేసి సౌలు చేతిలోనుండి నిన్ను విడిపించి నీ యజమానుని నగరిని నీ కనుగ్రహించి నీ యజమానుని స్త్రీలను నీ కౌగిట చేర్చి ఇశ్రాయేలువారిని యూదావారిని నీ కప్పగించితిని. ఇది చాలదని నీవనుకొనినయెడల నేను మరి ఎక్కువగా నీకిచ్చియుందును. నీవు యెహోవా మాటను తృణీకరించి ఆయన దృష్టికి చెడుతనము చేసితివేమి? హిత్తీయుడగు ఊరియాను కత్తిచేత చంపించి అతని భార్యను నీకు భార్య యగునట్లుగా నీవు పట్టుకొనియున్నావు; అమ్మోనీయులచేత నీవతని చంపించితివి గదా? (12:7-9).

దేవుడు దావీదుకు ప్రతిదాన్ని యిచ్చాడు, అతడు యింకను అవసరమనుకుంటే, యింకను అధికంగా దేవుడు అతని కనుగ్రహించేవాడే. దేవుడు ప్రసాదించినవాటితో అతడు తృప్తి చెందక మరియొకని దానిని దావీదు అపహరించాడు. అది కఠినమైన సందేశం, అయితే అది సత్యమే. అది దావీదుకు అవసరమైయుంది.

నేటి మత ప్రపంచంలో, నీవు కోరే ఏ ప్రసంగాన్నైనా నీవు కనుగొనవచ్చు. నీ జీవితంలోని సమస్తం క్షేమంగా ఉందనే ప్రసంగాన్ని నీవు వినగోరితే, అది నీకు దొరుకుతుంది. అయితే పాపమును బట్టి నీ జీవితం గందరగోళమైనప్పుడు, నీ నరములను మెత్తగిలజేసే ప్రసంగం నీకు అవసరముండదు. నాతాను వచ్చి, దావీదు భుజముల మీద చెయ్యివేసి, "నీవు బాధపడుతున్నావని నేనెరుగుదును, నేను కూడా బాధపరుస్తాను" - అంటూ అతన్ని బయటపెట్టకుంటే ఏమి జరుగుతుంది? తన జీవితంలోని ఇచ్చోట దావీదుకు అలాటిది అవసరం లేదు. నీకు కూడా అలాటిది అవసరముండదు. నీ జీవితంలో ఉన్న పాపాన్ని గూర్చి పాక్షికంగా యథార్థవంతుడైయుండక, పూర్ణంగా యథార్థ వంతుడై ఉండడం అవసరం!

కొన్ని పరిధులలో కాలానికి తగినట్టు నేను ఉండకపోవచ్చు, కాని నేను పాపమునకు వ్యతిరేకిని. పాపమొక శత్రువు. అది నాజూకు లేనిది కావచ్చు, కాని నేను త్రాగుబోతు తనానికి, నాట్యానికి, జూదానికి, కడుపులు తీసేదానికి, మర్యాదలేని వస్త్రధారణకు, లేఖన విరుద్ధమైన విడాకులకు, భౌతికవాదానికి, లైంగిక అపవిత్రతకు, వివాహపు అవిశ్వాస్యతకు, సిద్ధాంతపరమైన దోషాలవంటివాటికి వ్యతిరేకంగా నేను బోధిస్తాను. నేను ప్రసంగించేది ఈ అంశాల మీద మాత్రమే కాదు, బైబిల్లో వెయ్యిన్నొక్క ముఖ్యమైన అంశాలున్నాయి. మరోవైపు, నా కంటూ కొన్ని దృఢ నమ్మకాలున్నాయి. అలాటి విషయాలలో నేను నా దృఢ నమ్మకాలను దాచిపెట్టను.

"నాకు అది అక్కరలేదు. నాకు శిక్షావిధి అక్కరలేదు. నాకు కేవలం మధురమైన మృదువైనవి కావాలి" అని నీవు ప్రతిస్పందింపవచ్చు. నేను మళ్ళీచెప్తాను –నీ జీవితం తికమకగా ఉంటే నీతో సంపూర్తిగా నమ్మకంగా ఉండే ఒకరు మొట్టమొదట కావాలి. ఉండవచ్చు.

## అతనికి విరిగి నలిగిన హృదయం ఆవశ్యకమైంది

దావీదుకెలాగైనా, ఇంకా ఎక్కువ అవసరమయింది ఒక విశ్వాసపూర్ణమైన సందేశం సరియైనరీతిలో గ్రహించక పోతే దానివల్ల మంచి ఏమీ జరుగదు. దావీదుకు భగ్నమయ్యే హృదయం కూడా కావల్సివచ్చింది.

నాతాను సందేశానికి దావీదు పలు విధాలుగా బదులు చెప్పగలిగి యుండేవాడే. ప్రవక్తమీద కోపగించుకొని యుండవచ్చు. అదేమో అసాధారణమైన ప్రత్యుత్తరం కానవసరం లేదు. అతను సాకులు కూడా చెప్పి ఉండవచ్చు: "తాను స్నానం చేసిన చోట బత్షెబ స్నానం చేయక పోయినట్టయితే అది జరుగకపోయేదే. లేక ఊరియా మొండితనం కనుపరచకపోతే అతడు చచ్చి ఉండేవాడు కాదు" అని అని ఉండవచ్చు. మనం పడిన గందరగోళాన్ని గూర్చి యితరులమీద నిందవేయడం తేలికగదా? అయితే దావీదు ప్రవేశించిన గందరగోళాన్ని సరిచేయడానికి అతని జీవితానికి సాకులు చెప్పడం చాలదు. పాపాలకు మరో పాపాన్ని చేర్చుకొంటూ దావీదు తన పాపాన్ని దాచుకునే ప్రయత్నాన్ని కొనసాగించియుండవచ్చు. తిరిగి అతడు తూర్పు దేశాల ఏక చత్రాధిపతుల పరిపూర్ణాధికారాన్ని వినియోగించి నాతానును సహితం చంపి ఉండేవాడే.

దావీదు వాటిలో ఏ మార్గాన్నీ అనుసరించ లేదు. దానికి మారుగా, అతని హృదయం పగిలిపోయింది. దావీదు దేవుని హృదయానుసారుడు, అతడు పరిపూర్ణుడై నందున కాదు, కాని అతనికి తాకబడగల హృదయం ఉన్నందుననే. దావీదు నాతానుకు ప్రత్యుత్తరమిచ్చిన తీరును 2 సమూ. 12:13లో ఉంది, ఆలోచించు: "నేను పాపము చేసితినని దావీదు నాతానుతో" అన్నాడు. తన పాపాన్ని ఒప్పుకున్న ఈ చిన్న ఒప్పుకోలు కీర్తన. 51లో విస్తృతంగా తెలుపబడింది. అది "దావీదు బత్షెబవద్దకు వెళ్లిన తరువాత నాతాను ప్రవక్త అతని వద్దకు వచ్చినప్పుడు అతడు రచించిన కీర్తన" దావీదు తన హృదయాన్ని యిలా కుమ్మరించాడు:

దేవా, నీ కృపచొప్పున నన్ను కరుణింపుము
నీ వాత్సల్య బాహుళ్యముచొప్పున
నా అతిక్రమములను తుడిచివేయుము
నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము.
నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపరచుము.
నా అతిక్రమములు నాకు తెలిసేయున్నవి
నా పాపమెల్లప్పుడు నాయెదుటనున్నది.

నా పాపములకు విముఖుడవు కమ్ము
నా దోషములన్నిటిని తుడిచివేయుము.

దేవా, నాయందు శుద్ధహృదయము కలుగజేయుము
నా అంతరంగములో స్థిరమైన మనస్సును
నూతనముగా పుట్టించుము.
నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము
నీ పరిశుద్ధాత్మను నాయొద్దనుండి తీసివేయుము
నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము
సమ్మతిగల మనస్సు కలుగజేసి నన్ను దృఢపరచుము
(కీర్తన. 51:1-3, 9-12).

"నాకు ఈలాటి హృదయముందా?" అని మనలో ప్రతి ఒక్కరం ప్రశ్నించుకోవాలి. మన జీవితాలు కసాయి అంగడిగా మారినప్పుడు, మనకు అవసరమైన వాటిని ఎవరును మనకు సరఫరా చేయలేరు. మనకు ఉన్నదో, లేదో; మనకు లేకుంటే, అలాటి హృదయాన్ని పెంపొందించుకొనక పోయినట్టయితే, క్షమింపబడడానికి మనకు ఎక్కువ ఆశ ఉండదు.

## పాప క్షమాపణ యొక్క నిశ్చయత అతనికి అవసరం

మూడవదిగా, దావీదుకు పాపక్షమాపణ నిశ్చయత అవసరం. అతని పాపాలు క్షమించబడ్డాయనే నిశ్చయత లేకుండ అతడు వెళ్లగలిగేవాడు కాదు. మరల కీర్తన. 51:11 చూడు: "నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము నీ పరిశుద్ధాత్మను నా వద్దనుండి తీసివేయకుము" అని అతడు విన్నవించుకున్నాడు. సౌలు వద్దనుండి దేవుని ఆత్మ తీసివేయబడినప్పుడు ఏమి సంభవించిందో దావీదు చూచాడు.[26] సౌలు మతి తప్పినవాడయ్యాడు. రాజుకు ఉపశమనము కలిగించడానికి గాను రాత్రి వెంట రాత్రి దావీదు తన సితారాను వాయించుతూ వచ్చాడు. "అది నాకు సంభవింపనియ్యకుము" అని దావీదు అడుగుతున్నాడు!

అది జరుగలేదు. పాపక్షమాపణ యొక్క నిశ్చయతను దయచేశాడు. "నేను పాపము చేసితినని దావీదు నాతానుతో అనగా నాతాను – నీవు చావకుండునట్లు యెహోవా నీ పాపమును పరిహరించెను" అని తెలియజేశాడు (2 సమూ. 12:13).[27] ప్రవక్త ఆ మాటలు పలికినప్పుడు దావీదు హృదయములోనుండి భారము తొలిగింపబడింది. ఆ సమయంలో అతని ఆనందాన్ని గూర్చి కీర్తన. 32 యిలా చెప్పుతోంది:

తన అతిక్రమములకు పరిహారమునొందినవాడు
తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు.
యెహోవాచేత నిర్దోషి అని యెంచబడినవాడు
ఆత్మలో కపటములేనివాడు ధన్యుడు

నా దోషమును కప్పుకొనక
నీ యెదుట నా పాపము ఒప్పుకొంటిని
– యెహోవా సన్నిధిని నా అతిక్రమములు
ఒప్పుకొందుననుకొంటిని
నీవు నా పాపదోషమును పరిహరించియున్నావు
(కీర్తన. 32:1, 2, 5).

దావీదు దానికి పాత్రుడు కాడు, కాని దేవుడు కరుణాసంపన్నుడైయుండి అతనిని క్షమించాడు. నలుగగొట్టబడగల హృదయం దావీదుకు ఉంది; అతడు మారుమనస్సు పొంది తిరిగి దేవుని వద్దకు వచ్చినందున దేవుడు దావీదును క్షమించాడు.

సౌలు దావీదుల మధ్య వ్యత్యాసం యిక్కడుంది. మన దృష్టిలో, సౌలు పాపము దావీదు పాపమంత ఘోరమైనది కాదు. అయినా, దేవునిపై కేంద్రీకరించగల హృదయం సౌలుకు లేదు. సౌలు రాజకీయాలు, తలంచిన ప్రయోజనం, రాజ వంశస్థాపన, ఘనత, మహిమ అనేవాటి మీద అక్కర కలిగియున్నాడు. దేవుని ప్రవక్తచే సౌలు గద్దింపబడినప్పుడు, ప్రజలు ఏమనుకుంటున్నారో అక్కర కలిగియున్నాడే గాని దేవుడు ఎలా ఆలోచిస్తున్నాడో అతడు పట్టించుకున్నవాడు కాడు. దావీదు ఘోరమైన పాపము చేసినవాడైనా, తన వ్యక్తిత్వమంతటితో దేవుని గూర్చి, దేవునితో తనకున్న బాంధవ్యాన్ని గూర్చి అక్కరగలవాడై యున్నాడు. దేవుని ప్రవక్తచే అతడు గద్దింపబడినప్పుడు, తనకు పట్టినదంతా తన బాంధవ్యం పునరుద్ధరింపబడాలనేదే. వారి హృదయాల మధ్యగల వ్యత్యాసాన్ని బట్టి, సౌలుకు పాపక్షమాపణ నిశ్చయత లేకపోగా దావీదుకు అది లభించింది.

పాపాన్ని బట్టి మన జీవితాలు స్వాధీనం తప్పి పయనించినప్పుడు, మనం తన వద్దకు తిరిగి వస్తే ఆయన మనలను క్షమిస్తాడనే నిశ్చయతకంటె మించినది మరేమీ అవసరముండదు. అది మనకు బలమును, నిరీక్షణను ప్రసాదిస్తుంది. దేవుడు అంతటి కనికరం కలవాడై యుంటాడని నమ్మడం కొందరికి కష్టం కావచ్చు. "నా జీవితం దావీదు జీవితం కంటె ఎక్కువైన – దురాశ, వ్యభిచారము, అబద్ధం, హత్య అనేవాటితో చెడిపోయి ఉందా?" అని నిన్ను నీవే ప్రశ్నించుకో. దేవుడు దావీదును క్షమించగలిగినప్పుడు, ఎవనినైనా క్షమించగలడని విశ్వసించు. ఆయన నిన్ను క్షమిస్తాడు.

ఎవరును ఆక్షేపణ తెలుపకుండేలా, నేను ఈ తీర్మానాన్ని పాత నిబంధన మీద ఆధారపడి చేస్తున్నాను. క్రొత్త నిబంధనలో రోమా 4:7, 8ని ఆలోచించు: "తన అతిక్రమములకు పరిహారము నొందినవాడు తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు. **ప్రభువు**చేత నిర్దోషియని ఎంచబడినవాడు ధన్యుడు." ఈ మాటలతో పరిచయమున్నట్టు తోస్తుందా? నిజమే. కీర్తన. 32లో నుండి మనం యింతకు ముందే చదివాం.[28] "మనము ఆయన యొద్దకు తిరిగి వస్తే, దేవుడు మనలను క్షమిస్తాడు,

అది నా జీవితంలో నిజమని" పాత నిబంధనలో దావీదు అన్నాడు. "దేవునికి స్తోత్రం, అది యింకను నిలిచే ఉంది" అని క్రొత్త నిబంధనలో పౌలు చెప్పాడు!

ముందు నాణెంలో ఒకవైపు నేను చూపాను. ఒకని ఆత్మ సంబంధమైన స్థితి విషయమై సంపూర్ణమైన యథార్థతగల ఒకడు అవసరం – అని చెప్పాను. ఇప్పుడు ఆ నాణెం యొక్క రెండోవైపు చూద్దాం: తాను మారుమనస్సు పొంది జీవితాన్ని మార్చుకున్నప్పుడు తాను క్షమింపబడతాడని ప్రతి ఒక్కరు తెలిసికోవాలి. సిద్ధాంతపరంగాను, నైతికంగాను తప్పు ఒప్పుల విషయమై దృఢ విశ్వాసముగల బలమైన స్థానిక సంఘాలకు ప్రసంగించే భాగ్యం సువార్త చేస్తున్న నా సంవత్సరాలకు (నా జీవితానికి) కలిగింది. అదే స్థానిక సంఘాలు దేవుని కృపాకనికరములయందు నమ్మిక ఉంచుతాయి; తమ పాపములను గుర్తించి ప్రభువు వైపుకు తిరిగినవారిని వారు ప్రేమించి క్షమించగలవారైయున్నారు. కన్నీళ్లతో తిరిగి వచ్చినవారిని కన్నీళ్లతో చేర్చుకున్నవారు ఉండడం నేను ఎంతో తరచుగా చూచాను!

పాపం పట్ల వ్యతిరేకంగా వేదికపై నిలిచియుండడం వల్ల. మంచి పేరు కలిగి యుండడం, ముక్కు సూటిగా ఉండడం, ప్రేమ లేకుండడం, తీర్పరులుగా ఉండడం, తమ సంపూర్ణతను దెబ్బతీయకుండునట్లు పాపం చేసినవారిని తమలోనికి రానివ్వకుండడం కూడా సులభమే. నేను ప్రసంగించిన ఒక స్థానిక సంఘం పాపులతో నింపబడియుందంటే నీవు దిగ్భ్రమ చెందవచ్చు.[29] కొందరు ఈ పాపంతోనో, ఆ పాపంతోనో పోరాడుతూ ఉంటారు,[30] అయితే మనమందరం పాపంతో ఏదో ఒక రూపంలో పోరాడుతునే ఉంటాం (రోమా 3:23). దేవుడు ఏమి చెప్పాడో సరిగ్గా అదే చేయుమని ప్రతి మనిషికి తెలుపుతాం. – దేవునికి మరొక మార్గం లేదంటాం.[31] కాని అదే సమయంలో, మన అపరిపూర్ణతలను మనం గుర్తిస్తాం. మనం పాపం చేసినప్పుడు, మారుమనస్సు పొంది, మన పాపములను ఒప్పుకొని దేవునివద్ద క్షమాపణ కోరతాం,[32] మనకు క్షమాపణ లభించిందని మనం నమ్ముతాం. తోటి యోధులంగా ఒకరినొకరు బలపరచుకొని, ఒకరినొకరు ఆదరించు కొనడం అవసరం.

## ముందుకు సాగడానికి కొనసాగుతున్న బలం అతనికి అవసరం

నీవు క్షమింపబడినప్పుడు, విషయం అంతమయ్యింది, పాపము ఎన్నడూ జరుగనట్టు నేను చెప్పగోరతాను. దురదృష్టవశాత్తు, అది అలాగుండదు. నీ పాపంనుండి నీవు ఒక్క క్షణంలో క్షమింపబడవచ్చు. అయితే ఆ గందరగోళంనుండి బయటపడడానికి సంవత్సరాలు పట్టవచ్చు. గ్రంథంలో మనం యిలా చదువుతాం: "మీ పాపము మిమ్మును పట్టుకొనును" (సంఖ్యా. 32:23) మరియు "మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును" (గలతీ. 6:7). దావీదు ఊరియాపై కత్తి ప్రయోగించాడు; తాను ఏమి విత్తాడో యిప్పుడు అతడు ఆ పంటనే కోయనైయున్నాడు.[33] నాతాను అతనికి యిలా తెలిపాడు:

> .... హిత్తీయుడగు ఊరియాను కత్తిచేత చంపించి అతని భార్యను నీకు భార్య యగునట్లుగా నీవు పట్టుకొనియున్నావు; అమ్మోనీయులచేత నీవతని చంపించితివి

గదా? నీవు నన్ను లక్ష్యముచేయక హిత్తీయుడగు ఊరియా భార్యను నీకు భార్య యగునట్లు తీసికొనినందున నీ యింటివారికి సదాకాలము యుద్ధము కలుగును (12:9, 10).

తరువాత కొన్ని వచనాలు దావీదు జీవితం యొక్క చివరి ఇరవై సంవత్సరాలను సంక్షేపంగా వర్ణిస్తాయి.

నా మాట ఆలకించుము; యెహోవానగు నేను సెలవిచ్చునదేమనగా – "నీ యింటివారి మూలముననే నేను నీకు అపాయము పుట్టింతును; నీవు చూచుచుండగా నేను నీ భార్యలను తీసి నీ చేరువ వానికప్పగించెదను. పగటియందు వాడు వారితో శయనించును. నీవు ఈ కార్యము రహస్యముగా చేసితివిగాని ఇశ్రాయేలీయులందరు చూచుచుండగా పగటియందే నేను చెప్పినదానిని చేయింతును అనెను. ... అయితే ఈ కార్యమువలన యెహోవాను దూషించుటకు ఆయన శత్రువులకు నీవు గొప్ప హేతువు కలుగజేసితివి గనుక నీకు పుట్టిన బిడ్డ నిశ్చయముగా చచ్చునని దావీదుతో చెప్పి తన యింటికి వెళ్లెను" (12:11–14).

భయంకరమైన ఈ చివరి ప్రవచనాలు వెంటనే నెరవేర్పులోనికి వచ్చాయి. దావీదు యొక్క ప్రశస్తమైన బిడ్డ రోగియై చనిపోయాడు.[34] దావీదు యొక్క యింటనుండియే ఉద్భవించిన "కీడు"పై మన తరువాత పాఠం కేంద్రీకరింపబడింది. దావీదు తన పిల్లలయొక్క మర్యాదను కోల్పోయాడు. దావీదు కుమార్తెయైన తామారును అతని కుమారుడైన అమ్నోను మానభంగం చేశాడు; అమ్నోను అబ్షాలోమను దావీదు యొక్క మరొక కుమారునిచే చంపబడ్డాడు; అబ్షాలోము తన తండ్రియైన దావీదుకు విరోధంగా తిరుగుబాటును లేపి చంపబడ్డాడు. అబ్షాలోము తిరుగుబాటులో దావీదు "చేరువ వానికి" తన భార్యలు అప్పగింపబడతారనే ప్రవచనం నెరవేర్చబడింది.[35] ఈ వరుసలోని చివరి పాఠంలో, ఖడ్గము మాటి మాటికి ఎలా తళ తళలాడించబడిందో చూడబోతాం.

దీన్ని మళ్లా చెప్పుతున్నా: పాపము భయంకరమయింది! అది ఎంత భయంకరమైన దంటే, క్షమింపబడిన తరువాత సహితము దాని ప్రతిధ్వనులు నిలిచి ఉంటాయి! మన పలుకుబడి దెబ్బతింటుంది. నిష్కపటులైన ప్రజలు బాధింపబడతారు. కత్తి చేసిన గాయాలు సంవత్సరాల తరబడి ఉంటాయి. మరి యువకులతో "పాపానికి దూరంగా ఉండు. నీ యవ్వనేచ్ఛలు పాపానికి నడిపించకుండ చూచుకో, శోధననుండి తప్పుకో" అని అనడంలో వింతలేదు. దాని ప్రతిఫలాలు భయంకరమై ఉంటాయి!

దావీదుకు క్షమాపణ వెంటనే అవసరమయింది. ప్రతి చీకటి దినంలో సజీవంగా నిలిచియుండడానికి అతనికి వెనువెంట బలం కూడా అవసరమైయుంది.

దావీదు సజీవంగా ఎలా నిలిచాడు? క్షమాపణలోని నిశ్చయత అతనికి సహాయ పడింది.[36] నాతాను తనకు యిచ్చిన అభయంతో పాటు, వారి మధ్య ఉన్న బాంధవ్యం పునరుద్ధరించబడినట్టు దేవుడైన యెహోవా అతనికి నిశ్చయమైన రుజువు నిచ్చాడు. అందులో ఒక రుజువేమంటే, వారి తొలి కుమారుడు చనిపోయిన తరువాత దేవుడు దావీదు బత్షెబలకు మరొక కుమారుని ప్రసాదించాడు. వారు అతనికి సొలొమోను అనే

పేరు పెట్టారు, అంటే, "నెమ్మది" అని అర్థం. యెహోవా ఆజ్ఞను బట్టి నాతాను[37] ఆ బాలునికి యదీద్యా, అంటే "యెహోవాకు ప్రియుడు" అని పేరు పెట్టాడు. మరియొక రుజువు ఈ అధ్యాయం చివరి భాగంలో యివ్వబడింది: దావీదు యుద్ధాలు విజయ వంతంగా ముగించడం రబ్బా పట్టణాన్ని పట్టుకొనడంతో సూచింపబడింది. దేవునితో తన బాంధవ్యం పునరుద్ధరించబడడం దావీదుకు అన్నిటికంటెను మిన్నయైయుంది. అది అతనికి నిశ్చయం చేయబడిందంటే, అతడు ముందుకు సాగగలడు.

ఈ అభయముతో ముడివేయబడినదై దేవుడు భవిష్యత్తులో అతనికి సహాయం చేసి, బలపరచుతాడు అనే దృఢ విశ్వాసం అతనికుంది. "నాకు దాగుచోటునీవే," "శ్రమలోనుండి నీవు నన్ను రక్షించెదవు" అని దావీదు యెహోవాకు విన్నవించుకొంటు న్నాడు (కీర్తన. 32:7).

దావీదుకు సహాయపడిన మరొకటి – తనకు సహాయము చేసి తన్ను నిలబెట్టిన తన స్నేహితుల ప్రసన్నత. నాతాను దావీదు ప్రక్కనే నిలిచియున్నాడు,[38] దావీదుకు యింకను యితర స్నేహితులున్నారు – వారిలో సాదోకు,[39] హూషై,[40] మాకీరు[41] అనేవారున్నారు. ఈ స్నేహితులు దావీదు యొక్క చెడు కాలంలో అతనికి సహాయం చేశారు.

ఈలాటి కొన్ని మార్గాలను దేవుడు మనకు కల్పిస్తాడు. మారుమనస్సు పొంది, మనం దేవుని చిత్తాన్ని జరిగింప తిరిగి వస్తే, మనకు కూడా పాపక్షమాపణ వాగ్దానం చేయబడింది.[42] పైగా, దేవుడు మనతో కూడా ఉంటాడని అభయమిచ్చాడు. "**ప్రభువు** నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు?" (హెబ్రీ. 13:6). చివరిగా, సంఘమని పిలువబడే జనుల సముదాయాన్ని బలపరచు సముదాయంగా దేవుడు మనకు ప్రసాదించాడు. మనమందరం ప్రభువు సంఘంలో భాగమై యుండవలసి ఉంది.[43] మనకు ప్రోత్సాహము నిచ్చే స్థానిక సంఘముతో మనం కలిసి పనిచేస్తూ ఆరాధిస్తూ ఉండాలి.[44]

## ముగింపు

బైబిలు కథానాయకుల చిత్రాలను పరిశుద్ధాత్మ చిత్రించేటప్పుడు, వారికున్న అవలక్షణాలతో పాటు అన్నిటిని చిత్రిస్తాడు. ఇది కొందరికి తొందర కలిగిస్తుంది, కాని యిది నాకు సహాయం చేస్తుంది. పాపము తమ జీవితాల్లోనికి రానివ్వనంత బలిష్టులు ఎవరూ లేరని గ్రహించడానికి యిది నాకు సహాయపడుతుంది. మెలకువ కలిగి నిలిచియుండాలని యిది నాకు సవాలు చేస్తుంది. తమ హృదయాలు విరిగి నలిగి ఉండగలిగినంతవరకు, పాపక్షమాపణ లేని స్థితిలోనికి ఎవరును వెళ్లరని గుర్తించడానికి యిది సహాయపడుతుంది. దేవుని కనికరం కోసం పడి ఉండేలా నన్ను ప్రోత్సహిస్తుంది యిది నాకు ప్రోత్సాహమిస్తుంది.

చాలవరకు, మనం చదివిన కథాభాగం బలహీనమైంది. అయితే నీవు సంతోష కరమైన ముగింపును ఎదురు చూస్తావని నేను తలంచాను. దావీదు దేవుని సహవాసానికి

తిరిగి పునరుద్ధరించబడ్డాడు. కడకు తన జీవితంలో ఎదురయ్యే కష్టాలన్నింటితో, తన వెనుక వచ్చే రాజులందరికి దావీదు ప్రమాణంగా నిలిచాడు,[45] తాను మరణించిన వెయ్యి సంవత్సరాల తరువాత, దేవుని హృదయానుసారుడైన మనుష్యుడుగా[46] దావీదు నిలిచియున్నాడు. దావీదుకు తాకబడగల హృదయం ఉంది.

నీ జీవితం ఏ రూపులో ఉందో నాకు తెలియదు, అయితే బత్షెబతో పాపం చేసిన పిమ్మట దావీదు జీవితమున్నట్టు ఒకవేళ నీ జీవితం ఉన్నా, నేను నీకు ఈ అభయాన్ని యివ్వనివ్వు: నీ కథకు కూడా సంతోషాంతం ఉండగలదు – అయితే ఒక మాట – నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపంనుండి మరలి, దేవుని చిత్తాన్ని జరిగించితే అది నీ సొంతమౌతుంది.

---

## ప్రసంగపు నోట్సు

యాకోబు 1:14, 15లో పాపము యొక్క పురోభివృద్ధి సంక్షిప్త వర్ణనగా యివ్వబడినట్టు, 11వ అధ్యాయం స్పష్టమైన ఉదాహరణగా వినియోగింపవచ్చు. చార్లెస్ స్వెండిల్ ఈ మెటీరియల్‌ని యిలా సంక్షిప్తంగా వర్ణించాడు: "ఒక ఊరించే చూపు" "ఒక కామపు కార్యం," మరియు "నిలిచియుండు ఫలితాలు" (study guide on *David, A Man After God's Own Heart* [Fullerton, Calif.: Insight for Living], 102, 103).

మతసంబంధం కాని ప్రతి ప్రసంగపు వేదికనుండి "క్షేమకరమైన సెక్స్" ప్రకటింప బడుతున్న ఈ దినాలలో, వ్యభిచారమనే పాపము దాని పర్యవసానాలను గూర్చి బలంగా ఉపదేశింపబడవలసి ఉంటుంది (సామె. 6:32). (కొనసాగే హృదయాన్ని కనుగొనడం) *Finding the Heart To Go On* అనే పుస్తకంలో లిన్ అండెర్ సన్ వ్యభిచారాన్ని గూర్చి నాలుగు సూత్రాలను గుర్తించాడు. ([ San Bernardino, Calif.: Here's Life Publishers, 1992], 129-33). "క్షేమకరమైన సెక్స్" అనేదానికి బదులు "పవిత్రమైన సెక్స్" మనం ఉపదేశింపవలసి ఉంటుంది. (అంటే, దేవునికి అంగీకారమైన వివాహ బంధంలో).

ఈ పాఠంలోని సంఘటన సంభవించే కాలానికి దావీదు 30 సంవత్సరాల ప్రాంతంలో ఉంటాడని అంచనా వేయబడింది. పురుషులలో మధ్య వయస్సు యిబ్బందికి యిది ఆరంభపు బిందువుగా ఉండవచ్చు.

నాతాను దావీదు పాపాన్ని బయటపెట్టిన మాదిరి, "ఆదరించడానికి తగిన జాగ్రత్త" అవసరమని చూపుతుంది (సామె. 27:5, 6); ఆదరించడం ఎలాగో కూడ చూపుతోంది (గలతీ. 6:1; సామె. 15:23; 25:11). నాతాను ఈ విషయాన్ని ఎదుర్కొన్న విధానంలో లిన్ ఆండెర్ సన్ అయిదు తలంపులను చూపాడు. (*Finding the Heart To Go On,* 144-48). మనం ప్రజలను ప్రేమించినట్టయితే వారు జీవితాల్లో యిట్టి కార్యాలను మనం అలక్ష్యం చేయము. ఎందుకంటె అది వారి జీవితాలను భౌతికంగాను, ఉద్వేగంగాను, ఆత్మ సంబంధంగాను అవి నాశనం చేస్తాయి.

పిల్లలు చనిపోయిన వారిని ఆదరించడానికి తరచుగా దావీదు కుమారుని మరణ

గాథ ఉపయోగింపబడుతుంది. "మనం ప్రేమించినవారు చనిపోతే" అనే పాఠానికి అది ఆధారం కావచ్చు.

"నలిగిన హృదయం గలవాని కేక" అని కీర్తన. 51 మీద అనుబంధపు పాఠాలు బోధింపవచ్చు.

---

సూచనలు

[1]ఇదే పేరుతో గల ఇలాంటి కీర్తన జూలై1987 ఆంగ్లంలో ప్రచురించిన సంచికలో కనబడింది. ఆ పాఠం ఈ సంపుటానికి తగినట్టు విస్తృతం చేయబడింది. [2]ఇంటివద్ద ఉండాలనేది సంపూర్ణంగా దావీదు యొక్క ఉద్దేశం కాకపోవచ్చు (2 సమూ. 18:3; 21:17). అయినా యెరూషలేములో నిలిచియుండాలనే తుది నిర్ణయం దావీదు చేయవలసిందే. [3]"ఒక సాయంకాలపు వేళ" అని RSV అంటుంది. [4]"పడకమీదనుండి లేచి" అనడంలో అతడు మధ్యాహ్నపువేళ నిద్రించినట్టు కన్పిస్తుంది. [5]బత్షెబ దోషియనిగాని నిర్దోషియనిగాని లేఖనం చెప్పలేదు. దావీదు యొక్క కామానికి ఆమె ఎంతవరకు బాధ్యురాలు? దావీదుకు యిష్టపూర్వకంగా లోబడిందా ఆక్షేపణ తెలిపిందా? ఆమె నిజంగానే ఊరియా విషయమై దుఃఖం సలిపిందా లేక అదంతా నాటకమా? ఈ ప్రశ్నలకు మనం జవాబులు చెప్పలేం. లేఖనాలకు సంబంధించినంతవరకు అది దావీదు పాపమే. రచయిత అక్కర కలిగియున్నది దావీదును గూర్చి మాత్రమే. [6]బత్షెబ ఎక్కడ స్నానం చేసిందో, దావీదు ఆమెను ఎలా చూచాడో మనకు తెలియదు. బత్షెబ నిజంగా ఏమి చేస్తుందో కూడా మనకు తెలియదు. తన దేహంలో కొంత భాగంవరకు మాత్రమే ఆమె స్నానం చేయవచ్చు. తన దేహమంతా వస్త్రహీనంగా కనబడనవసరం లేదు. బత్షెబ దావీదుకు ఎరవేసిందని మనం ఊహించ వీలులేదు. [7]ఆది. 23:1-20; 25:9; సంఖ్యా. 13:29; యెహోషువ 9:1, 2; 11:3; న్యాయాధి. 3:5, 6; 1 సమూ. 26:6. [8]2 సమూ. 23:39; (1 దినవృ. 11:41 కూడా చూడు). [9]"తన అపవిత్రతనుండి ఆమె శుద్ధి చేసికొనినప్పుడు, ఆమె తన యింటికి వెళ్లెను." 2 సమూ. 11:4. ASVలో, "అతడు ఆమెతో పరుండెను" (ఎందుకనగా ఆమె తన అపవిత్రతనుండి తన్ను తాను శుద్ధిచేసికొనుచుండెను) NIVలో, "తన అపవిత్రతనుండి ఆమె శుద్ధిచేసికొనియుండెను" అప్పుడు ఆమె తన యింటికి వెళ్లెను. "తన అపవిత్రత" అనేది ఆమె నెల స్థితి కాలమైయుండవచ్చు. స్త్రీ అప్పుడు చట్ట ప్రకారము శుద్ధి చేయబడుతుంది. (లేవీయ. 15:19-24). తన నెల స్థితి కాలము అంతరించిన తరువాత వ్యభిచారం జరిగినట్టు సూచిస్తున్నాడు. అంటే దావీదు వద్దకు రాక పూర్వము ఆమె గర్భవతియై యుండలేదని యిది రుజువు చేస్తుంది. 2వ వచనంలోని స్నానము తనను పవిత్రపరచుకొనడానికి చేసినదైయుండవచ్చు. [10]ఆది. 43:34లో ఉపయోగింపబడిన హెబ్రీ పదం - "బహుమతి" (present) అనేది భోజనాన్ని సూచిస్తుంది. KJV, ASV మరియు NKJV బహుమానమంటున్నాయి. 2 సమూ. 11:9లో యింటికి తీసికొని పోవడానికి భోజన బహుమానం.

[11]ఆ యింటిని దావీదు తన మేడగదిపైనుండి చూడగలిగాడు. [12]మందసం ఫిలిష్తీయుల చేతిలోనుండి తెచ్చుకొనిన సాహసం తరువాత సైన్యం తిరిగి మందసాన్ని సైన్యంలోనికి కొనిపోయారని దాని భావమా? (1 సమూ. 4). అలాటి అవసరమేమీ ఉండదు. మందసం యెరూషలేములో తాత్కాలికమైన ఆశ్రయంలో ఉంచబడియుంది. మందసం రబ్బా పట్టణాన్ని కొనిపోయి ఉన్నట్టయితే, ఆరాధనకు సంబంధించిన ఉద్దేశాలతో అయ్యుంటుందేమోగాని, అదృష్టం వర్తిస్తుందనే భావంతో అది కొనిపోబడియుండదు (2 సమూ. 15:25ను పోల్చి చూడు). [13]2 సమూ. 11:21, 23, 24ను గమనించు, "అమ్మోను కుమారుల ఖడ్గంచేత" ఊరియా చంపబడినట్టు 2 సమూ. 12:9 అంటుంది. అయితే, అమ్మోనీయులు యుద్ధంలో అతని చంపారని అర్థం కావచ్చు. [14]తిరుగటి రాయిచే అబిమెలెకు చంపబడిన సంగతిని గూర్చి దావీదు అతనిని అడుగుతున్నాడన్న విషయం యోవాబు ఎదురు చూచి యుంటాడు. ఎందుకంటె అతడు గోడకు బహు సమీపంగా ఉన్నాడు. న్యాయాధి. 9:50-57 కథ చెప్తుంది. సైనిది నాయకులందరికిని అది ఎరిగిన పాఠమే. [15]ఆమె విలాపము నిష్కపటమైనదో కాదో మనకు చెప్పబడలేదు. ఊహించినా ఏ విలువా లేదు. [16]ఆది. 50:10; 1 సమూ. 31:13లను చూడు. [17]బిడ్డ పుట్టినట్టు ఎంతవరకు విషయం వ్యాపించిందో గుర్తించు: 2 సమూ. 12:14. [18]ఇంకొకని త్రాగబోయించే సంగతి (హబక్కూకు 2:15, 16) మరియు యితర పాపాలు ప్రస్తావించలేదు.[19]1 సమూ. 15:1-23.[20]కీర్తన. 32 దావీదు పాపం తరువాత వ్రాసినట్టు బలమైన పారంపర్యం ఉంది.

[21]ఈ సంకీర్తనలకు భావాన్వయం వివరంగా ఉంది. [22]దేవాలయం నిర్మాణ సందర్భంలో దావీదుతో నాతానును

చివరిగా చూచాం (2 సమూ. 7) [23]మనలో చూచుకోగలిగే దానికంటె యితరులలో పాపాన్ని చూడడం సులభం. [24]ఇది నిర్గమ. 22:1లో కోరినదానికి యిది అనుగుణ్యంగా ఉంది. [25]దావీదు తన మాటలతో తానే శిక్ష విధించుకున్నాడు దయ చూపనివాడు తానే. [26]1 సమూ. 16:14నుండి. [27]చట్ట సమ్మతంగా అతడు మరణానికి పాత్రమైన నేరం కాకపోయినా నాతాను ఉపమానంలోని ధనవంతుని దావీదు మరణ పాత్రుడని అన్నాడు. మరో విదంగా చూస్తే, తన వ్యభిచారానికిని హత్యకును దావీదు మరణ పాత్రుడే (లేవీ. 20:10; 24:17), అయితే మహోన్నతుడు తన కృపచొప్పున ఆ శిక్షావిధినుండి అతని తప్పిస్తాడు. [28]కీర్తన. 32:1, 2. కీర్తన. 32 యొక్క పదజాలం కొంత తేడాగా కన్పిస్తుంది ఎందుకంటె కీర్తన. 32 నేరుగా హెబ్రీనుండి తర్జుమా చేయబడింది. అపొస్తలులు సహజంగా గ్రీకు తర్జుమానుండి కోట్ చేశారు (సెప్టూజంట్). [29]నేను దీన్ని ప్రసంగించినప్పుడు యిలా అంటాను: "నీ ఎదుట ఉన్న వ్యక్తి పాపి, నీ వెనుకనున్న వ్యక్తి పాపి, నీ ముందన్న వ్యక్తి పాపి, నీ కుడివైపునున్న వ్యక్తి పాపి, నీ ఎడమవైపునున్న వ్యక్తి పాపి, మనమందరం పాపులం అని నేను అంటే నీకు దిగ్భ్రమ కలుగవచ్చునని నేను అనుకొంటున్నాను." [30]యాకోబు 1:14.

[31]మత్తయి 7:21నుండి. [32]అపొ. 8:22; 1 యోహాను 1:9; యాకోబు 5:16. [33]తరువాత పాఠంలో ఈ సత్యం వివరింపబడుతుంది. [34]"దావీదు కుమారుడు చనిపోయినప్పుడు" అనే వ్యాసాన్ని చూడు. [35]2 సమూ. 16:22తో పోల్చి చూడు. [36]కీర్తన. 32:1, 2. [37]నాతాను ఈసారి మంచి వార్తతో వస్తాడు. [38]2 సమూ. 12:25; 1 రాజులు 1:8నుండి. [39]2 సమూ. 15:24. [40]2 సమూ. 15:37లో హూషై "దావీదు స్నేహితుడని" పిలువబడ్డాడు.

[41]2 సమూ. 17:27. మెఫీబొషెతును దాచినవాడు యితడే. [42]అపొ. 2:38; 1 యోహాను 1:9. [43]అపొ. 2:38, 47; 1 కొరింథీ. 12:13; ఎఫెసీ. 1:22, 23; 5:23, 25. [44]నేను దీనిని బోధిస్తున్నప్పుడు సాధారణంగా ఈ విషయం వద్ద నవ్వుతుంటాను. నేనొక వేళ నిక్కచ్చిగా ఉంటే ఈ సంఘం ఆలాంటి సంఘమేనని తలుస్తాను. మీరు మాలో ఒక భాగమౌతారని నిజంగా నమ్ముతాను. అది నీ జీవితాన్ని ఆశీర్వదిస్తుందని విశ్వసిస్తాను. [45]1 రాజులు 15:3. [46]అపొ. 13:22.

# దావీదు యొక్క బిడ్డ చనిపోయినప్పుడు

## 2 సమూ. 12:15-24

దావీదు బత్షెబతో పాపము చేసిన తరువాత, నాతాను దావీదును యెదుర్కొని యిలా అన్నాడు, "...నీవు చావకుండునట్లు యెహోవా నీ పాపమును పరిహరించెను. అయితే ఈ కార్యమువలన యెహోవాను దూషించుటకు ఆయన శత్రువులకు నీవు గొప్ప హేతువు కలుగజేసితివి గనుక నీకు పుట్టిన బిడ్డ నిశ్చయముగా చచ్చునని దావీదుతో చెప్పి తన యింటికి వెళ్లెను"[1] (2 సమూ. 12:13బి-15). నాతాను వెళ్లినంతలోనే, బిడ్డ ఉన్న స్థలంనుండి ఒక శిశువు ఏడ్పు వినిపించింది.[2] ఆ ఏడ్పుతో దావీదు ఎముకలలో చలి పుట్టించింది "యెహోవా ఊరియా భార్య దావీదునకు కనిన బిడ్డను[3] మొత్తినందున అది బహు జబ్బుపడెను" (16 వ.).

చిన్న బిడ్డలకు జబ్బులు వస్తాయి; పసిపిల్లలు చనిపోతారు. ఈ సత్యాన్ని గురించి కాదు మనం ఇక్కడ ఆలోచించేది. అది మనం ఎదుర్కొనడానికి యిష్టపడే వాస్తవం కాదు; ఏది కాకపోయినా అది మాత్రం వాస్తవమే. సమాధుల దొడ్డిలోని కొన్ని సమాధులు

కొన్ని అడుగులు పొడవుగా ఉంటాయి. పుట్టుకలోనే చనిపోయిన పసికందుల సమాధి కార్యక్రమంలో నేను ప్రసంగించాను. మృతి పొందాలని చేయబడిన నియమం (హెబ్రీ. 9:27) కొన్ని సార్లు మరణం రాదగిన సమయంకంటె త్వరగా వస్తుంది.

## బిడ్డ జబ్బుపడి చనిపోయినప్పుడు, దానికి కారణమేమైయుండవచ్చు

దేవుని ఉద్దేశాలన్నీ మనం అర్థం చేసికోలేం. "అతడు పరదైశును ప్రకాశవంతంగా చేయునట్లు దేవుడు నీ కుమారుని పిలుచుకున్నాడని" మనం ఏవిధమైన నిశ్చయతతోను చెప్పలేం. కొన్నిసార్లు పసిబిడ్డ యొక్క మరణానికి అర్థం తెలియకుండా ఉంటుంది. ఏదియెలాగున్నా, కొన్నిసార్లు అలా జరగడానికి కారణం ఉన్నట్టు మన మూల వాక్యము చెప్తుతోంది. అదేదో మనం ఎప్పటికీ చెప్పలేం, కాని కొన్నిసార్లు దేవునికి కారణ ముంటుంది.

దావీదు యొక్క సందర్భంలోవలె, కొన్నిసార్లు తల్లిదండ్రుల యొక్క పాపము హేతువైయుండవచ్చు. అది న్యాయంగా కన్పించదు గాని, జీవితం అలాగే ఉంటుంది. దోషుల పాపమును బట్టి అమాయకులు బలియౌతున్నట్టు అనుదినం మనకు తెలిసివస్తూ ఉంటుంది. శిశువులు (AIDS) ఎయిడ్స్‌తోను, ఆయా వ్యాధులతోను పుడతారు. "నా బిడ్డ మరణంతో దేవుడు నన్ను ఎందుకు శిక్షిస్తున్నాడు?" అని నీవు ప్రశ్నిస్తావని నేను దీనిని చెప్పడం లేదు. అలాటి ప్రశ్నకు విలువలేదు. ఇది ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే, కొన్నిసార్లు యిది నిజం.

శిశువు మరణం ఆ శిశువుకు తరచుగా దీవెనగా ఉంటుంది. ఆలాటి శిశువు జీవించియుంటే, భౌతికంగా గాని, మరోవిధంగా గాని ఆ బిడ్డ అనేక తీవ్రమైన కష్టాలు ఎదుర్కోవలసి వచ్చే అవకాశముంది. దావీదు బిడ్డ చనిపోడానికి దేవుడు సమ్మతించాడు ఎందుకంటే దావీదు పాపము తెలిసినప్పుడు, ఆశిశువుకు ఆ "కళంకము" తగిలి ఉంటుందని కొందరు తలంచారు. "సాంప్రదాయ విరుద్ధమైన" జన్మ అంటే ఆ దినాల్లో మహా భయంకరంగా ఉండేది. ఇది దేవుని ఆలోచనలో భాగమైయుందో లేదో మనకు తెలియదు – దేవుని మనస్సును మనం గ్రహించలేం (యెషయా 55:8, 9) – అయితే శిశువు యొక్క మరణం అనేక సార్లు నిజంగా "అత్యుత్తమమైనదిగా" ఉంటుంది.

## బిడ్డ వ్యాధితో ఉన్నప్పుడు, మనం మన అంతరంగంతో ప్రార్థించాలి

శిశువుకు జబ్బుచేసినప్పుడు ...

> దావీదు ఉపవాసముండి లోపలికి పోయి రాత్రి అంతయు నేలమీదపడి యుండి బిడ్డకొరకు దేవుని బతిమాలగా,[4] ఇంటిలో ఎన్నికయైనవారు లేచి అతనిని నేలనుండి

లేవనెత్తుటకు వచ్చిరిగాని అతడు సమ్మతింపక వారితో కూడ భోజనము చేయక యుండెను (12:16, 17).

ఏడు రాత్రింబగళ్లు దావీదు దేవునికి తన హృదయమును కుమ్మరిస్తూ, బిడ్డను కాపాడుమని అతడు దేవునికి మనవి చేసికొంటూనే ఉన్నాడు. అతడు అలా ఎందుకు చేశాడు? బిడ్డ చనిపోతాడని దేవుడు ముందుగానే తెలియజేశాడు గదా? ఎందుకంటే దేవుడు తన కాఠిన్యాన్ని తగ్గించుకొనే అవకాశముందని అతడు నమ్మాడు (12:22). మరణ దండనకు పాత్రమైన పాపముల విషయంలో తానే దోషియై ఉండలేదా, అయినా "నీవు చావవు" అని దేవుడు అతని పాపాన్ని పరిహరించియుండలేదా? (12:13).

బిడ్డకు ఏమి సంభవించినా, పరిస్థితులు ఎంత ఆశ లేని స్థితికి దిగజారినా, ప్రార్థన ఎల్లప్పుడు తగినదిగా ఉంటుంది; ఎందుకంటె మన దేవుడు కృపగల దేవుడైయున్నాడు (12:22).

## బిడ్డ చనిపోయినప్పుడు, మన జీవితంలోని ముక్కలను ఎత్తుకొని ముందుకు పోయే సమయం

దేవుడు తన పిల్లల ప్రార్థనలకు ఎల్లప్పుడు బదులిస్తాడు, అయితే ఆ జవాబు కొన్నిసార్లు "కాదు" అని ఉంటుంది. ఇది నేర్చుకోవలసిన కఠినమైన పాఠం. దావీదు ప్రార్థన హృదయపూర్వకమైనదై తీవ్రమైనదైయున్నా, ఏడు దినాలు ప్రయాస తరువాత బిడ్డ చనిపోయాడు. అది సంభవించినప్పుడు, ఆ వర్తమానాన్ని దావీదుకు అందివ్వడానికి సేవకులు భయపడ్డారు. "బిడ్డ ప్రాణముతో ఉండగా, మేము అతనితో మాటలాడినప్పుడు అతడు మా మాటలు వినక యుండెను. ఇప్పుడు బిడ్డ చనిపోయెనని మనము అతనితో చెప్పిన యెడల తనకుతాను హాని చేసికొనునేమో"యని వారు తలంచారు (12:18బి-19ఎ).

తన సేవకులు గుస గుసలాడుకొనడం దావీదు చూచినప్పుడు, బిడ్డ చనిపోయినట్టు దావీదు గ్రహించాడు. అది నిజమేనని తన సేవకులు నిర్ధారించినప్పుడు, దావీదు చేసిన పని వారిని ఆశ్చర్యపరచింది. "అప్పుడు దావీదు నేలనుండి లేచి స్నానముచేసి తైలము పూసికొని వేరు వస్త్రములు ధరించి యెహోవా మందిరములో ప్రవేశించి మ్రొక్కి తన యింటికి తిరిగి వచ్చి భోజనము తెమ్మనగా వారు వడ్డించిరి; అప్పుడు అతడు భోజనము చేసెను" (12:20). ఈ రోజుల్లో దాన్ని మనమేమంటామంటే – "అతడు తన మోకాళ్లమీదనుండి లేచాడు, స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు, మంచిగా నాస్తా చేసి ఆఫీసుకి వెళ్లాడు." దావీదు ఆ బిడ్డను తిరిగి తీసికొని రాలేకపోయాడు (23 వ.). దీర్ఘంగా సాగిన విలాపం అతని బిడ్డకు సహాయం చేయలేకపోయింది. అది దావీదును మాత్రమే బాధించింది. అది ఎంత కష్టమైనా, తన జీవితాన్ని కొనసాగించకతప్పదు.

## బిడ్డ చనిపోయినప్పుడు, పరలోకంలో తిరిగి కలిసికొనడానికి సిద్ధపడాలి

ఆశ్చర్యపడిన దావీదు సేవకులు అతనిని యిలా అడిగారు: "–బిడ్డ జీవముతో ఉండగా ఉపవాసముండి దానికొరకు ఏడ్చుచుంటివి గాని అది మరణమైనప్పుడు లేచి భోజనము చేసితివి" (12:21), అప్పుడు దావీదు యిచ్చిన జవాబు అత్యుత్తమమైనది:

> అతడు – బిడ్డ ప్రాణముతో ఉన్నప్పుడు దేవుడు నాయందు కనికరించి వాని బ్రదికించునేమో యనుకొని నేను ఉపవాసముండి యేడ్చుచుంటిని. ఇప్పుడు చనిపోయెను గనుక నేనెందుకు ఉపవాసముండవలెను? వానిని తిరిగి రప్పించగలనా? నేను వానియొద్దకు పోవుదును గాని వాడు నాయొద్దకు మరల రాడని వారితో చెప్పెను (12:22, 23).

లేఖనాల్లో తేటగా బోధింపబడిన సంగతి ఏదైనా ఉంటే, పిల్లలు చనిపోయినప్పుడు పరదైసుకు వెళ్లతారనేదే (మత్తయి 18:3; 19:14). తమ చేతులలోనుండి లాగివేయబడిన తమ చిన్నారులతో తల్లిదండ్రులు మరల అద్భుతంగా జతకూడతారనే విషయాన్ని నీవు ఊహించగలవా?[5] అయితే యిక్కడ "అసలైన విషయం" ఉంది. ఏమంటే, ప్రశస్తమైన నా చిన్నారితో తిరిగి కలిసికోగోరితే, నేను (పరలోకానికి) వెళ్లవలసియుంటుంది. అందుకు నేను సిద్ధమే? నీవు సిద్ధమేనా?

దావీదు చెప్పినదానిలో విషయమేమంటే – "నేను వానిని వెనుకకు తోడుకొని రాలేను, కాని యిది మాత్రం నేను చేయగలను, నేను వానియొద్దకు పోగలను."[6] తన బిడ్డను పోగొట్టుకున్న ప్రతి తండ్రి తీర్మానం అదే అయ్యుండాలి.

## బిడ్డ చనిపోయినప్పుడు, మనం సమస్తాన్ని దేవుని చేతికి అప్పగించివేయాలి

దావీదు కోపంతోను దుఃఖంతోను నిండియుండవచ్చు. అతడు దేవుని నిందించి ఉండవచ్చు. అతడు దేవునితో వాదించి ఉండవచ్చు. దానికి బదులు, "అతడు యెహోవా మందిరములో ప్రవేశించి మ్రొక్కాడు" (12:20). దేవుడే సమస్త సంగతులను చక్కపరచ గలడు.

ముందుగా గమనించినట్టే, మనకు దేవుని మనస్సు తెలియదు. మనం ఊహించలేనన్ని గొప్ప సంగతులు ఆయన మనకొరకు దాచియుంచి ఉండవచ్చు. దావీదు విషయానికి వస్తే, దేవుడు అతనికి మరొక కుమారుని అనుగ్రహించాడు – సొలొమోను అని పేరు పెట్టబడిన అద్భుతమైన కుమారుడు.

> తరువాత దావీదు తన భార్యయైన బత్షెబను ఓదార్చి ఆమె యొద్దకు పోయి ఆమెను కూడగా ఆమె యొక కుమారుని కనెను. దావీదు అతనికి సొలొమోను అని పేరు పెట్టెను. యెహోవా అతనిని ప్రేమించి నాతాను అను ప్రవక్తను పంపగా అతడు

> యెహోవా ఆజ్ఞనుబట్టి యదీద్యా [యెహోవాకు ప్రియుడు] అని అతనికి పేరు పెట్టెను (12:24, 25).

ఒకవేళ నీకు కూడా మరియొక కుమారుడు కలుగవచ్చు, లేకపోవచ్చు. ఇంతకు ప్రాముఖ్యమైన విషయమేమంటే – ఏమి సంభవించినా సరే దేవునికి సన్నిహితంగా ఉండు. నీవు అలా ఉన్నట్టయితే, ఆయన నీ జీవితాన్ని దీవిస్తాడు – తప్పక దీవిస్తాడు.

---

సూచనలు

[1]దావీదు యొక్క పాపాన్ని గూర్చి అవిశ్వాసులు ఎరిగియుండవచ్చుననే వాస్తవంతో బిడ్డయొక్క మరణం నేరుగా కలుపబడింది. దావీదు యొక్క చర్యను దేవుడు అంగీకరించలేదన్నది వెంటనే జరిగి కన్పించే సూచన ద్వారా ప్రత్యక్షపరచబడింది. [2]ఆ బిడ్డయొక్క వయస్సును కొందరు మూడు మాసాలుగా అంచనా వేస్తారు. [3]దేవుని కృపా కార్యాలను గూర్చి రహస్యాలు మనం ఎన్నడే కొలతవేయలేనంత మర్మంగా ఉంటాయి. 2 సమూ. 12:10–14లోని ప్రవచనాలన్నీ పాపభరితులైన వ్యక్తుల యొక్క సారథ్యంలోనే నెరవేర్చబడ్డాయి. ఉదాహరణకు, “నేను నీ భార్యలను తీసి నీ చేరువవానికి యిచ్చెదను” అని దేవుడు చెప్పాడు (11 వ.). ఏదియెలాగున్నా, దేవుడు దీనిని నేరుగా జరిగించలేదు. దావీదు యెరూషలేమునుండి పారిపోయినప్పుడు, అబ్షాలోము దీనిని జరిగించాడు. దేవుడు భవిష్యత్తును చూచాడు. అబ్షాలోము ఆ కార్యం చేస్తుంటే ఆయన ఊరకున్నాడు. దేవుడు దావీదు బిడ్డను వ్యాధితో “మొత్తాడు” ఎలా? ఆయన దానిని తానే స్వయంగా చేశాడా? లేక ప్రకృతిలోని సామాన్యమైన అస్వస్థతను – పసిపిల్లలను చంపే రోగానికి ఆ శిశువును వదలాడా? మనం ఎన్నడు దీన్ని ఎరుగలేం. ఏదియెలాగున్నా, దావీదు యొక్క పాపానికి అది దేవుని శిక్షయన్నట్టు, దైవ ప్రేరేపిత రచయిత మనలను తెలిసికోగోరాడు. [4]దావీదు నేలను పడియున్నది – యెహోవా మందసమునకై వేయబడిన గుడారపు ముందు భాగములోనై యుండవచ్చు. [5]పరలోకములోని మన బాంధవ్యం భూమిమీద ఉన్నట్టిదైయుండదు (మత్తయి 22:30) అయినా మనకు “మనముగానే” పరలోకంలో ఉంటామని ఒకరినొకరం ఎరుగుతామని బైబిలు బోధిస్తున్నట్టు రచయిత అభిప్రాయపడుతున్నాడు. నేను చిత్రించిన దృశ్యంలాటిది – మనం కనీసం ఊహించలేని ఆత్మ సంబంధమైన సెట్టింగై ఉంటుంది – అలాగు ఉండవచ్చు. [6]“నేను సమాధిలోనుండి వానిని తీసికొని రాలేను, కాని ఏదో యొక రోజున నేను వానితో సమాధియందు జతకూడతాను” అని దావీదు అన్నట్టు కొందరు వ్యాఖ్యానించారు. ఒకవేళ యిదే సరియైనదైయుండవచ్చు. అయితే అలాటిది ఆదరణనొసగేది కాకుండ నిరుత్సాహపరచేదై యుంటుందని నాకు తోస్తుంది. ఈ జీవితానంతరం ఉండబోయే జీవితాన్ని గూర్చిన క్రొత్త నిబంధన సందేశంతో చేర్చి చదివినంత మాత్రాన ఏ హాని ఉండదనేది నా అభిప్రాయం. [7]యెరూషలేములో యెహోవా మందసం కొరకు నిర్మించబడిన గుడారములో దావీదు పూజకై ప్రవేశించియుండవచ్చు, లేక గిబియోనులోనున్న ప్రత్యక్ష గుడారమునకు అతడు వెళ్లి ఉండవచ్చు.